మాజీ సీఎం కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే సత్తా రేవంత్‌కు లేదు : బీఆర్ఎస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పల్లెపంగ నాగరాజు

నేరేడుచర్ల, నవంబర్ 9 : ప్రాణాలకు తెగించి తెలంగాణను సాధించిన రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఆనవాళ్లు కానరాకుండా చేసే సత్తా సీఎం రేవంత్ రెడ్డికి లేదని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్లెపంగ నాగరాజు అన్నారు. పార్టీ సోషల్ మీడియా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. గత పదేండ్లు కేసీఆర్ పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అమలైన హామీలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు. మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహారావు, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి నాగార్జున, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావుడ్య శ్రీనునాయక్, సభ్యులు బచ్చలకూరి నాగశేఖర్, నాగుల వంచ వాసు, కొత్త నాగయ్య, గరిడేపల్లి మండల సోషల్ మీడియా కార్యదర్శి నరేశ్ తదితరులున్నారు.

కేసీఆర్‌పై సీఎం రేవంత్ అనుచిత వ్యాఖ్యలు సరికావు : సతీశ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్‌యువజన నాయకుడు సతీశ్

పాలకవీడు, నవంబర్ 9 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన నాయకుడు పెరుమాళ్ల సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చావు నోట్లో తలపెట్టి, పదవులన్నింటినీ గడ్డిపోచల్లాగా వదిలి కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేసీఆర్ తెచ్చిన రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సీఎం ఆయిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ప్రతిపక్ష నేత కేసీఆర్ చావును కోరుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు అశోక్, పిచ్చయ్య, వీరబాబు, నవీన్, సతీశ్ పాల్గొన్నారు.

దళితుల పక్షాన పోరాడితే దాడులు చేస్తారా : రామ్ సైదులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు

గరిడేపల్లి, నవంబర్ 9 : మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం 2వ విడుత నిధులు మంజూరు చేయాలని హుజూరాబాద్‌లో వేలాది మంది దళితులతో కలిసి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే దాడులు చేస్తారా అని బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి రామ్‌సైదులు ప్రశ్నించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేయడం రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. దళితుల జీవితాల్లో వెలుగు నింపాలని కేసీఆర్ ఉన్నతమైన లక్ష్యంతో దళితబంధు ప్రవేశపెడితే సీఎం రేవంత్‌రెడ్డి 2వ విడుత నిధులు విడుదల చేయకుండా వివక్ష చూపుతున్నారని మండి పడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్, పల్లెపంగు నాగరాజు, పెరుమళ్ల సతీవ్, ఇంతియాజ్,రాం, మధు, అంజి తదితరులున్నారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం : జూలకంటి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి, నవంబర్ 9 : ఎర్రజెండా పోరాటాలతోనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. తాళ్లమల్కాపురం గ్రామంలో శనివారం సీపీఎం మండల 8వ మహాసభకు యానాల సుశీల నందిపాటి మట్టయ్య అధ్యక్షులుగా వ్యవహరించగా రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కులం, మతాల పేరుతో ప్రజల ఐక్యతకు భంగం కలిగిస్తుందని మండి పడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు, పారేపల్లి శేఖర్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకట్‌రెడ్డి, అనంతు ప్రకాశ్, బ్రహ్మం, కే.నగేశ్, వట్టెపు సైదులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల్లేవు'

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నడిగూడెం, నవంబర్ 9 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేవని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దండా వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం వారు పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, మట్టిపెల్లి సైదులు, నరసింహారావు, బెల్లంకొండ వెంకటెశ్వర్లు, కోరట్ల శ్రీనివాస్, ఆంజనేయులు, కిశోర్ పాల్గొన్నారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
WANTED
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్లు ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | తొలుపునూరి : 9182777638

రైతులకు మద్దతు ధర అందేలా చూడాలి

● రైస్‌మిల్లర్ల సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్


సమావేశ వివరాలు వెల్లడిస్తున్న అదనపుకలెక్టర్ శ్రీనివాస్

మిర్యాలగూడ, నవంబర్ 9: రైతులు పండించిన సన్న ధాన్యాన్ని మద్దతు ధర రూ.2320కు నుంచి రూ.24200 వరకు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. రైతులు అధికంగా హైబ్రిడ్ రకం సన్న ధాన్యాన్ని పండిస్తున్నారని, మద్దతు ధరకు పైగా చెల్లించి కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కూడా ధాన్యం నాణ్యతతో తీసుకు రావాలన్నారు. మిల్లుల వద్ద రైతులకు మద్దతు ధర లభించనట్లయితే ధాన్యాన్ని ఆరబెట్టి ఐకేపీ కేంద్రాలకు తీసుకొస్తే మద్దతు ధర రూ.2320తో పాటు రూ.500 బోనస్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు కోత మిషన్లతో వరి చేలు కోయడం వల్ల ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుందని, ధాన్యాన్ని ఆరబెట్టి 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. జిల్లాలో 340 ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఐకేపీ కేంద్రాల్లో 38వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రూ.14కోట్లను రైతులకు చెల్లించామని వివరించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీసీఎస్ఓ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం హరీశ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిర్యాలగూడ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గంటా సంతోశ్‌రెడ్డి, బండారు కుశలయ్య పాల్గొన్నారు.

మహ్మద్ ఇక్బాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

● మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, నవంబర్ 9: కవి, రచయిత మహ్మద్ ఇక్బాల్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని ప్రకాశంబజార్ ఇక్బాల్ మినార్ వద్ద 'ఫలాహ – ఏ– మిల్లత్ ఎడ్యుకేషన్ సొసైటీ' ఆధ్వర్యంలో మహ్మద్ ఇక్బాల్ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇక్బాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ ప్రజల ఐక్యత కోసం ఇక్బాల్ కృషి చేశారని గుర్తుచేశారు. డాక్టర్ ఏఏ ఖాన్, హష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు ఉర్దూలో సైతం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ షఫీ నవాజ్ ఖాన్, హజ్‌హౌస్ ముతవల్లీ ఇజాజ్ అన్సారీ, ముస్లిం పెద్దలు బాబా జియా, ముంతాజ్, ఇస్మాయిల్‌ఖాన్, ఖాదర్, ఆబిద్ అంజుమ్, ఖాజా మెహతుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

● పెన్షనర్స్ సంఘం నల్లగొండ యూనిట్ అధ్యక్షుడు గజవెల్లి సత్యం

పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

రామగిరి, అక్టోబర్ 9: పెన్షనర్ల పెండింగ్ డీఏ విడుదల చేయడంతో పాటు పీఆర్‌సీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదా వాసుదేవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండలోని పెన్షనర్స్ భవనంలో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఈహెచ్ఎస్ అమలు, కమ్యూటేషన్ పీరియడ్ అందించాలని కోరారు. అనంతరం జన్మదినోత్సవం జరుపుకున్న 25 మంది పెన్షనర్స్‌ను సన్మానించి జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జెల్లా పుల్లయ్య, కేశవాచారి, చొల్లేటి ప్రభాకర్, జి.వెంకటయ్య, రామలింగం పాల్గొన్నారు.

నేడు మానవ హక్కుల వేదిక జిల్లా మహాసభ

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నకిరేకల్, నవంబర్ 9 : మానవ హక్కుల వేదిక జిల్లా మహాసభను ఆదివారం సాయంత్రం 5 గంటలకు నకిరేకల్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర బాధ్యులు జి. మోహన్ తెలిపారు. శనివారం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభలకు ప్రజాస్వామ్యక వాదులు, ప్రజలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో వేదిక జిల్లా అధ్యక్షుడు చింతమల్ల గురూజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి వీరస్వామి, నాయకులు అద్దంకి దశరథ, జీఎస్ఎన్ ప్రసాద్, శెట్టిపల్లి కాశీరాం పాల్గొన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరుడికి బోనాలు

బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

శాలిగౌరారం, నవంబర్ 9 : మండల కేంద్రంలోని కంఠమహేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గౌడ కులస్తులు బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

వ్రతం ఆచరిస్తున్న మహిళలు

మిర్యాలగూడ, నవంబర్ 9: మండలంలోని గూడూరు గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో శనివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. 50 జంటలు వ్రతంలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దైద సంజీవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, చెన్నూరు గిరిధర్‌రావు, బొంగరాల మట్టయ్య, సైదులు పాల్గొన్నారు.

జవాన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వీరజవాన్ వెంకటేశ్వర్లుకు నివాళి

చండూరు, నవంబర్ 9: గట్టుప్పల మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన వీరజవాన్ వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా శనివారం గ్రామంలోని ఆయన విగ్రహానికి మాజీ సర్పంచ్ దెందే బీరప్ప, స్థానికులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన వెంకటేశ్వర్లు త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ బట్టుపోతుల ప్రదీప్, రావుల నారాయణ, బాలం మహేశ్, షేక్ సైదులు, గంగబోయిన మహేశ్, రావుల యాదగిరి, భీమనపల్లి యాదయ్య పాల్గొన్నారు.

12న జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనపై ఉపాధ్యాయులకు శిక్షణ : డీఈఓ

రామగిరి, నవంబర్ 7: జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శనపై సైన్స్, గణిత ఉపాధ్యాయులు ఈ నెల 12న శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డైట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ ఉపాధ్యాయులకు, మధ్యాహ్నం 2గంటలకు నల్లగొండ డివిజన్ ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని సూచించారు. 7 అంశాలల్లో ప్రదర్శన ఉంటుందని, జిల్లాలోని అన్ని యాజమన్యాల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయించి ప్రదర్శించాలని కోరారు. దాంతో పాటు బీఈడీ, డీఈడీ విద్యార్థులు నూతన ఆవిష్కణ, బోధనా అభ్యాసన వనరులను ప్రదర్శించే అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని, సెల్ 9848578845ను సంప్రదించాలని సూచించారు.

18లోగా పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలి : డీఈఓ

రామగిరి, నవంబర్ 9: మార్చి 2025లో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజును ఈ నెల 18లోగా చెల్లించాలని డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో డిసెంబర్ 2 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 12 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 21 వరకు ఫీజు చెల్లించ వచ్చని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులు అంత కంటే ఎక్కువ ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.110 చెల్లించాలని సూచించారు. విద్యార్థుల నుంచి అంతకంటే ఎక్కువ ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్యాంక్ మేనేజర్ మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

చందంపేట(దేవరకొండ), నవంబర్ 9 : డిండి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన డీసీసీ బ్యాంక్ మేనేజర్ మహ్మద్ ఖాదర్ పాషా మృతికి మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సంతాపం వ్యక్తం చేశారు. శనివారం దేవరకొండ పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లి ఖాదర్ పాషా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ జానిబాబా, ఇలియాస్ పటేల్, ఖాదర్‌బాబా, అఫ్రోజ్, మహ్మద్ బాబా, జాఫర్ ఉన్నారు.

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి : ఈఆర్ఓ వెంకటేశం

వివరాలు తెలుసుకుంటున్న ఈఆర్ఓ

చండూరు, నవంబర్ 9: 18 ఏండ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలని మునుగోడు నియోజకవర్గ ఈఆర్ఓ జి.వెంకటేశం సూచించారు. శనివారం మండలంలోని బంగారిగడ్డ 207, గుండ్రపల్లిలోని 210, 211 పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఓటు నమోదు కోసం ఫామ్–6ను, ఓటరు జాబితాలో తప్పుల సవరణకు ఫామ్–8 నింపి ఈ నెల 10లోగా బీఎల్ఓకు అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఈఆర్ఓ దశరథ, బీఎల్ఓలు భాగ్యలక్ష్మి, సుహాసిని, పార్వతమ్మ, పుష్ప, శిరీష ఉన్నారు.

అవంతీపురానికి మాలధారుల పాదయాత్ర

త్రిపురారం, నవంబర్ 9: మండల కేంద్రానికి చెందిన 60 మంది ఆంజనేయ, పది మంది అయ్యప్ప మాలధారులు మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరాలయానికి శనివారం పాదయాత్రగా బయల్దేరారు. బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మట్టయ్య, నగిరి వెంకన్న, కటకం మల్లిఖార్జున్, జంగిలి శ్రీనివాస్, రాంబాబు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాత్రను ప్రారంభిస్తున్న అనుముల శ్రీనివాస్‌రెడ్డి

ఎంజీయూను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

రామగిరి, నవంబర్ 9: మహాత్మాగాంధీ యూనివర్సిటీని తెలంగాణలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ఆదిశగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని ఎంజీయూలో రూ. 33.35 కోట్లతో నిర్మించనున్న పరిపాలనా భవనం, మహిళా హాస్టల్, అంతర్గత సీసీ రోడ్ల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.4.60 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే వేముల వీరేశం, వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆనాడు సీఎంగా ఉన్న వైఎస్సార్‌తో మాట్లాడి నల్లగొండ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం వర్సిటీని మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. విద్యార్థులంతా బాగా చదివి జీవిత లక్ష్యం చేరుకోవాలని, తల్లిదండ్రుల ఆశలను సాకారం చేయాలని కోరారు. వర్సిటీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బంది వేతనాల విషయమై సీఎంతో చర్చించి పెంచేలా చూస్తానన్నారు. యూనివర్సిటీపై ప్రతి 15రోజులకు ఒక సారి సమీక్ష చేస్తామన్నారు. వర్సిటీకి రూ.10లక్షల విలువైన వివిధ సబ్జెక్టుల, పోటీ పరీక్షల పుస్తకాలను ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించామన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ వర్సిటీలో ప్యూరిఫైడ్ వాటర్ అందేలా, స్కిల్ నాల్జెడ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ఎంజీయూలో సెల్ఫ్‌ఫైనాన్స్ పద్ధతిలో నడిచే కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా నిర్వహించేలా, వర్సిటీలో అధ్యాపకులను నియమించేలా ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ఎంవీ గోనారెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సెల్ వై.ప్రశాంతి, వివిధ విభాగాల అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, ప్రతిప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబసర్వే పకడ్బందీగా చేపట్టాలి

● ఎమ్మెల్యే సామేల్


పెర్కకొండారంలో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, నవంబర్ 9 : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశించారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో శనివారం ఇన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి వివరాలు అందించాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి మన్యానాయక్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, తాసీల్దార్ యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

● సబ్ కలెక్టర్ నారాయణ్

రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

వేములపల్లి, నవంబర్ 9: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు పూర్వ పాఠశాల విద్యకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ కోటేశ్వరి, ఎంపీడీఓ శారదాదేవి, ఆర్ఐ స్పందన, అంగన్‌వాడీ టీచర్లు రజిత, శోభారాణి, జయమ్మ, పద్మ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ, నవంబర్ 9: సీపీఎం నల్లగొండ జిల్లా 21వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మిర్యాలగూడలో డిసెంబర్ 2,3,4 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబర్ 2న మహా ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, అయూబ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి : సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్‌ను పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య శనివారం నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాదె నరసింహ, పాక లింగయ్య, యోగానందం, భద్రయ్య పాల్గొన్నారు.

ఆభరణాల కోసం వృద్ధురాలి హత్య

మంగాపురంలో దొంగల ఘాతుకం

వేములపల్లి, నవంబర్ 9: ఆభరణాల కోసం వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేస